క్లుప్తంగా

సుబ్రహ్మణ్యస్వామికి విశేషంగా అభిషేకాలు



విశేష అలంకరణలో సుబ్రహ్మణ్యస్వామి

సింహాచలం: అడవివరం దరి విజినిగిరిపాలెంలోని ఉమాచంద్రమౌళీశ్వరస్వామి ఆలయంలో కొలువైన వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామికి మంగళవారం విశేషంగా అభిషేకాలు, పూజలు నిర్వహించారు. భక్తులు స్వామివారి సన్నిధి చుట్టూ ప్రదక్షిణలు చేశారు. క్షీరాభిషేకం చేసి భక్తిశ్రద్ధలతో స్వామిని కొలిచారు. ఆలయ అర్చకులు ద్వాదశి సోదరులు, ఉదయ్‌కృష్ణశర్మ ఆధ్వర్యంలో ఈపూజలు జరిగాయి.

వైభవంగా అప్పన్న నిత్య కల్యాణం



మాంగల్యధారణ ఘట్టం నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి మంగళవారం నిత్యకల్యాణం విశేషంగా జరిగింది. ఆలయ బేడామండపంలో ఉదయం 9.30గంటల నుంచి ఈకార్యక్రమాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి,భూదేవిలను సింహాసనంపై అధిష్టింపజేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, కంకణధారణ, సంకల్పం, యజ్ఞోపవీతం, జీలకర్రబె బెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాల ఘట్టాలతో కల్యాణం వైభవంగా నిర్వహించారు. విశేషంగా హారతులు అందజేశారు. ఉభయదాతలకు కల్యాణ అక్షింతలు, ప్రసాదం అందజేశారు. అర్చకులు చిన్నా, శ్రీకాంత్ తదితరులు ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.

10న గ్రంథాలయంలో ఉచిత వైద్య శిబిరం



సమావేశంలో మాట్లాడుతున్న గ్రంథాలయాధికారి సూర్యకళ

పెందుర్తి: స్థానిక శాఖా గ్రంథాలయంలో ఈ నెల 10న ఉచిత వైద్య శిబిరం నిర్వహించనున్నట్టు గ్రంథాలయాధికారి బి.సూర్యకళ తెలిపారు. మంగళవారం గ్రంథాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. ఆదివారం ఉదయం 9 నుంచి ప్రారంభం కానున్న శిబిరంలో మెడి కవర్ ఆస్పత్రి వైద్యులు వివిధ రకాల పరీక్షలు చేస్తారన్నారు. బీపీ, షుగర్, ఈసీజీ, ఇతర ముఖ్యమైన రక్త పరీక్షలు ఉచితంగా చేస్తారని ప్రజలంతా అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సమావేశంలో గ్రంథాలయాభివృద్ధి కమిటీ ప్రతినిధులు పెతకంశెట్టి భూలోకరావు, ఆదారి రామకృష్ణ, పెంటకోట గణేష్, ఎస్.గణేష్ తదితరులు పాల్గొన్నారు.

కళా ఉత్సవ్‌కు ఆరిపాక విద్యార్థులు

సబ్బవరం: ఈ నెల 11, 12 తేదీల్లో భీమిలి డైట్ కళాశాలలో జరగనున్న కళాఉత్సవ్‌లో మండలంలోని ఆరిపాక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన 20 మంది విద్యార్థులు పాల్గొంటారని పాఠశాల ఆంగ్ల ఉపాధ్యాయురాలు బీవీ రామలక్ష్మి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. వీరిలో 10 మంది బాలురు, 10 మంది బాలికలు ఉన్నారన్నారు. శాస్త్రీయ సంగీతం, జానపద సంగీతం,వివిధ వాయిద్యాలు వాయించడం, శాస్త్రీయ నృత్యం, చిత్రలేఖనం ,2డీ,3డీ బొమ్మల తయారీ అంశాలమీద పోటీలు నిర్వహిస్తున్నారు. పోటీలో మొదటి స్థానంలో గెలుపొందినవారు రాష్ట్రస్థాయిలో ఈనెల 14, 15 తేదీల్లో విజయవాడలో జరిగే పోటీల్లో పాల్గొంటారన్నారు. విజేతలకు నగదు,మెడల్ తో పాటు అవార్డులు ఇస్తారని ఆమె తెలిపారు.

10న విజిల్ బ్లోయర్ చిత్ర ప్రదర్శన

సీతంపేట: ప్రపంచ మానవ హక్కుల దినోత్సవాన్ని పురస్కరించుకుని మానవ హక్కుల అంశంపై రూపొందించిన 'విజిల్ బ్లోయర్' ఆంగ్ల చిత్రాన్ని ఈ నెల 10వ తేదీ ఆదివారం సాయంత్రం 6 గంటలకు ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో ప్రదర్శించనున్నట్టు వైజాగ ఫిల్మ్ సొసైటీ కార్యదర్శి నరవ ప్రకాశరావు తెలిపారు. ఈ సినిమా తిలకించడానికి ఉచిత ప్రవేశం కల్పిస్తున్నట్టు పేర్కొన్నారు.

మిచాంగ్ అలజడి

- తెరిపివ్వని వాన
- ఈదురుగాలులకు నేలకొరిగిన పంట
- పలు చోట్ల కూలిన వృక్షాలు
- లోతట్టు ప్రాంతాలు జలమయం



తిక్కవానిపాలెం తీర ప్రాంతంలో పరిస్థితులను పరిశీలిస్తున్న అధికారులు



గౌతులచ్చన్ననగర్ వద్ద కూలిన భారీ వృక్షం



పరవాడలో కురుస్తున్న వర్షం



రావాడలో ఈదురుగాలులకు నేలకొరిగిన వరి పంట

పరవాడ: మిచాంగ్ తుపాను మండలంలో అలజడి సృష్టించింది. రెండు రోజులుగా ఎడతెరిపిలేకుండా కురుస్తున్న వర్షాలకు వాగులు వంకలు పొంగి ప్రవహించాయి. లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. రెండో రోజు మంగళవారం వర్షంతో పాటు వీచిన ఈదురుగాలులకు పరవాడ-గాజువాక రహదారి లో గౌతులచ్చన్ననగర్ వద్ద రోడ్డు పక్కనున్న భారీ వృక్షం నేలకూలింది. చెట్టు కొమ్మలు ఎదురుగా ఉన్న షెడ్డుపై పడడం వల్ల ఆ షెడ్డు కూడా కూలిపోయింది. అదేవిధంగా ఈ. బొనంగి ఫార్మాసిటీ కాలనీ రహదారిలోని చెట్లతో పాటు మాంసం దుకాణం కోసం నిర్మించిన షెడ్డు ఈదురుగాలులకు కూలిపోయింది. భారీ వృక్షం కూలిన ఘటనలో విద్యుత్ వైర్లు తెగిపోయాయి. ఫలితంగా మధ్యాహ్నం నుంచి సాయంత్రం వరకు విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో వినియోగదారులు ఇబ్బందులు పడ్డారు.

ట్రాఫిక్ జామ్

గౌతులచ్చన్ననగర్ వద్ద చెట్టు కూలడంతో కార్లు, ద్విచక్ర ప్రయాణికులు రాకపోకలకు ఇబ్బందులు పడ్డారు. కూలిన చెట్టును పోలీసులు, విద్యుత్ శాఖ అధికారులు తొలగించి వాహనాల రాకపోకలను పునరుద్ధరించారు. తుపాను ఫలితంగా వీచిన ఈదురుగాలులకు మండలంలో పలు గ్రామాల్లో వరి పంట నేలకొరిగింది. రావాడ, పరవాడ, భర్నికం, తానాం, వాడచీపురుపల్లి, కలపాక గ్రామాల్లో 38 మంది రైతులకు చెందిన 29 హెక్టార్లలో వరి పంట నేలకొరిగిందని మండల వ్యవసాయాధికారి సీహెచ్.చంద్రావతి చెప్పారు. నేల కొరిగిన వరి పంటలను పరిశీలించి సహాయ చర్యలు చేపట్టినట్టు తెలిపారు.

లోతట్టు ప్రాంతాలను సందర్శించిన అధికారులు

రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు లోతట్టు ప్రాంతాలు ముంపునకు గురికాకుండా ముందస్తు చర్యలు చేపట్టామని తహసీల్దారు పి.కనకారావు చెప్పారు. ముత్యాలమ్మపాలెం, తిక్కవానిపాలెం తీర ప్రాంత మత్స్యకారులు సముద్రంపై చేపల వేటకు వెళ్లకుండా అప్రమత్తం చేశారు. గ్రామాల్లో వీఆర్వోలను అందుబాటులో ఉంచినట్టు చెప్పారు. అవసరమైన సహాయక చర్యలు చేపట్టడానికి సిద్ధంగా ఉన్నామన్నారు.

నేలకొరిగిన వరిపంట

సబ్బవరం: తుపాను ప్రభావంతో కురుస్తున్న వర్షాలతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అధికారులు అప్రమత్తం చేయడంతో కోసిన పంటను కుప్పలుగా పెట్టుకున్నారు. మరి కొంత మంది కోతలు వాయిదా వేసుకున్నారు. అయితే పంట పండి పోవడంతో ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షాలతో పాటు గాలుల వల్ల పంట నేలకొరిగింది. సుమారు 120 ఎకరాల వరకు వరి పంట నేలకొరిగినట్టు అధికారులు గుర్తించారు. గ్రామ వ్యవసాయ సహాయకులు ఆయా పొలాలను పరిశీలించారు. బుధవారం నుంచి ప్రాథమిక పంట నష్ట నివేదికను జిల్లా అధికారులకు సమర్పించనున్నారు.

వరి పంట సంరక్షణకు సూచనలు..

వర్షం తగ్గిన తర్వాత వరి పనలు లేదా కుప్పలు తడిస్తే గింజ మొలకెత్తకుండా ఉండడానికి 5 శాతం ఉప్పు ద్రావణం(50 గ్రాముల ఉప్పును లీటర్ నీటికి) పనలపై పడే విధంగా పిచికారీ చేయాలి. పొలంలో నీరు నిలిచి ఉన్నట్లయితే పనలను గట్లపైకి తెచ్చుకొని విడగొట్టి ఉప్పు ద్రావణం చల్లుకోవాలి. వర్షాలు తగ్గి ఎండ రాగానే పనలను తిరగేసి ఎండబెట్టి నూర్చుకోవాలని వ్యవసాయ అధికారి పోతల సత్యనారాయణ సూచించారు.



తవ్వవానిపాలెంలో పడిపోయిన వరి పంట



పంటను పరిశీలిస్తున్న వ్యవసాయ సిబ్బంది

బోసిపోయిన వారపు సంత



ఖాళీగా ఉన్న పరవాడ వారపు సంత

పరవాడ: తుపాను కారణంగా రెండు రోజులుగా ఎడతెరిపిలేకుండా కురుస్తున్న వర్షాలకు మండల నలు మూలల నుంచి వినియోగదారులు రాకపోవడంతో పరవాడలో మంగళవారం నిర్వహించిన వారపు సంత బోసిపోయింది. ఉదయం 6 నుంచి వినియోగదారులతో రద్దీగా ఉండే రోడ్లు, సంత ప్రదేశం ఖాళీగా కనిపించాయి. వర్షం లేకపోతే సంతలో లక్షల వ్యాపారం జరిగేది. వర్షం కారణంగా మంగళవారం వేలల్లో కూడా వ్యాపార లావాదేవీలు జరగలేదని దుకాణదారులు వాపోయారు. జోరుగా కురిసిన వర్షానికి సరకులు తడిసిపోకుండా వ్యాపారులు జాగ్రత్తలు తీసుకున్నారు. రోజంతా కురిసిన వర్షంతో వ్యాపారాలు లేక వ్యాపారులు సాయంత్రం ఉసూరుమంటూ ఇళ్ల దారిపట్టారు.

భక్తిశ్రద్ధలతో కార్తీక తదియారాధన



అన్నప్రసాదాన్ని స్వీకరిస్తున్న ఈవో శ్రీనివాస మూర్తి, ట్రస్ట్‌బోర్డు సభ్యులు

సింహాచలం: సింహగిరిపై మంగళవారం కార్తీక తదియారాధనను భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ఆలయ కల్యాణ మండపంలో మధ్యాహ్నం 12 నుంచి 2.30 గంటల వరకు ఈ కార్యక్రమాన్ని దేవస్థానం అర్చకులు, అధికారులు నిర్వహించారు. దేవస్థానం ఉద్యోగులు, ట్రస్ట్‌బోర్డు సభ్యులు, భక్తులు, సింహగిరి నిర్వాసితులు స్వామివారి అన్నప్రసాదం స్వీకరించారు. ఏటా కార్తీక మాసంలో సింహగిరిపై తదియారాధన నిర్వహించడం పరిపాటిగా వస్తోందని స్థానాచార్యులు టి.పి.రాజగోపాల్ తెలిపారు. దేవస్థానం ప్రధానర్చాకుడు గొడవర్తి శ్రీనివాసాచార్యులు, పురోహిత్ అలంకారి కరి సీతారామాచార్యులు, వైదికులు ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో దేవస్థానం ఈవో ఎస్.శ్రీనివాసమూర్తి, ఎస్‌డీసీ రామలక్ష్మి, ట్రస్ట్ బోర్డు సభ్యులు గంట్ల శ్రీనుబాబు, సువ్వాడ శ్రీదేవి, బయ్యవరపు రాధ, దశమంతులు రామలక్ష్మి, పెనుమత్స శ్రీదేవి వర్మ, ఈఈలు శ్రీనివాసరాజు, రాంబాబు, ఏఈ హరి, ఏఈవోలు నరసింహరాజు, పాలూరి నరసింగరావు తదితరులు పాల్గొన్నారు.

10న మెగా బ్రాహ్మిణ్ పిక్నిక్

డాబాగార్డెన్స్ : బిజినెస్ బై బ్రాహ్మిణ్ సొసైటీ ఆధ్వర్యంలో ఈ నెల 10న ఆనందపురం కొంత్యాం రోడ్డులో గల విశ్వనాథ్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఫార్మాస్యూటికల్ సైన్స్ కాలేజీలో కార్తీక వన సమారాధన నిర్వహించనున్నట్టు కమిటీ చైర్మన్ చెరువు రామకోటయ్య ఒక ప్రకటనలో తెలిపారు. సుమారు వెయ్యి మంది బ్రాహ్మణ వ్యాపారులను కలుపుతూ ఈ కార్తీక వన సమారాధన ఉంటుందని, ఆటలు, సాంస్కృతిక కార్యక్రమాలతో పిక్నిక్ నిర్వహిస్తున్నట్టు తెలిపారు. బ్రాహ్మణ ఆత్మీయ కలయికలో వ్యాపారులే కాక వృత్తి, ఉద్యోగాల్లో స్థిరపడిన వారు కూడా పాల్గొనవచ్చని, ప్రవేశ రుసుం లేదని పేర్కొన్నారు. బ్రాహ్మణ హైకోర్టు అడ్వకేట్లు, డాక్టర్లు, సినీ ప్రముఖులు పాల్గొంటున్నట్టు తెలిపారు.

వైభవుని సన్నిధిలో రేపటి నుంచి పవిత్రోత్సవాలు



వైభవ వేంకటేశ్వర స్వామి

మురళీనగర్: కప్పరాడ ఎన్‌జీజీవోస్ కాలనీలో కొలువుదీరిన వైభవ వేంకటేశ్వర స్వామి ఆలయంలో పవిత్రోత్సవాలు గురువారం నుంచి నిర్వహించనున్నట్టు ఆలయం కార్యనిర్వహణాధికారి బండారు ప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. కార్తీక బహుళ ద్వాదశి శనివారం వరకు శ్రీవారి సన్నిధిలో త్రయాహ్నిక దీక్షతో పాంచరాత్ర దివ్య ఆగమ విధానంలో ఉత్సవాలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. బహుళ ఏకాదశి శుక్రవారం సామూహికంగా శ్రీసత్యనారాయణ స్వామి వ్రత మహోత్సవం చేస్తామన్నారు. 7న ఉదయం 5 గంటలకు సుప్రభాత సేవ, ప్రాతఃకాలార్చన, బాలభోగం, మంగళశాసనం, తీర్థ ప్రసాద గోష్టి నిర్వహిస్తామని తెలిపారు. ఆ రోజు ఉదయం 9 గంటలకు విష్వక్సేన పూజ, పుణ్యాహవచనం, మత్స్యంగ్రహణం, అగ్నిప్రతిష్ఠ, అంకురార్పణ, ధ్వజారోహణం, చక్రబ్ధమండల రచన, మంగళశాసనం, సాయంత్రం 6గంటలకు మండపారాధన, మండలార్చన, పవిత్రాధివాసం, విశేష హోమాలు, బలిహరణ, తీర్థ గోష్ఠి నిర్వహిస్తామని ఈవో పేర్కొన్నారు.

అమర జవాన్‌కు ఘన నివాళి



హుస్సేన్ స్మారక చిహ్నం వద్ద నివాళులర్పిస్తున్న కమాండెంట్ భటేరియా తదితరులు

ఆనందపురం : మండలంలోని పందలపాకలోని 56వ ఐటీబీపీ ఫోర్స్‌లో పనిచేస్తూ విధి నిర్వహణలో అమరుడైన కానిస్టేబుల్‌కు అధికారులు ఘనంగా నివాళులర్పించారు. కృష్ణా జిల్లా అవనిగడ్డకు చెందిన జీడి షేక్ హాజీ హుస్సేన్ 2013లో ఐటీబీపీ ఫోర్స్‌లో కానిస్టేబుల్‌గా విధుల్లో చేరారు. ఇక్కడ విధులు నిర్వహిస్తూ 2019లో ఉత్తరాఖండ్‌లోని పితోర్‌ఘర్‌లో విధి నిర్వహణలో భాగంగా అమరుడయ్యాడు. ఈ మేరకు హుస్సేన్ విద్యాభ్యాసం చేసిన అవనిగడ్డ ఉన్నత పాఠశాల వద్ద గ్రామస్తులు స్మారక చిహ్నం ఏర్పాటు చేశారు. ఈ మేరకు మంగళవారం అంతిమ త్యాగ దినోత్సంలో భాగంగా పందలపాక బెటాలియన్ కమాండెంట్ డీకే భటేరియా సిబ్బంది హుస్సేన్ స్మారక చిహ్నం వద్ద ఘనంగా నివాళులర్పించారు.

ఐవీఎఫ్ కేంద్రాల తనిఖీ



వైద్యులతో మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో డాక్టర్ జగదీశ్వరరావు

మహారాణిపేట : జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి (డీఎంహెచ్‌వో) డాక్టర్ పి.జగదీశ్వరరావు ఆధ్వర్యంలో మంగళవారం నగరంలో గల పలు ఐఆర్‌టీ, ఐవీఎఫ్ కేంద్రాలను తనిఖీ చేశారు. ఆడమ్స్ ఐవీఎఫ్ కేంద్రంలో ఏఆర్‌టీ బ్యాంక్, పద్మశ్రీ ఐవీఎఫ్‌లో ఏఆర్‌టీ లెవెల్-2, అనిల్ నీరుకొండ ఆస్పత్రిలో ఏఆర్‌టీ లెవెల్-1, గీతం ఆస్పత్రులను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయా కేంద్రాలకు పలు సూచనలు చేశారు. ఆపరేషన్ థియేటర్, వార్డు, స్కానింగ్ మెషీన్లను తనిఖీ చేశారు. ఆస్పత్రులకు ఏఆర్‌టీ కేంద్రాల నిర్వహణకు అనుమతులు ఉన్నాయో లేదో, వైద్యులు, ఉద్యోగుల విద్యార్హతలను పరిశీలించారు. ల్యాబ్ పరికరాలను పరిశీలించి సలహాలు ఇచ్చారు. ఈ కేంద్రాల్లో పేదవారికి ఫీజు తగ్గించి తీసుకోవాలని కోరారు. ఈ తనిఖీ బృందంలో డాక్టర్ గీతా వందన, ఎల్.వి.రమణి, డాక్టర్ బి.ఉమావతి, బి.నాగేశ్వరరావు, కె.శివాజీ తదితరులు పాల్గొన్నారు.

కనకమహాలక్ష్మికి అష్టదళ పద్మారాధన



అష్టాదళ పద్మారాధనలో కనకమహాలక్ష్మి అమ్మవారు

డాబాగార్డెన్స్ : బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మి దేవస్థానంలో మంగళవారం 108 స్వర్ణపుష్పాలతో అష్టదళ పద్మారాధన నిర్వహించారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు నిర్వహించిన ఈ పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆలయ ఈవో కె. శిరీష, ధర్మకర్తల మండలి చైర్‌పర్సన్ కొల్లి సింహాచలం, పలువురు ధర్మకర్తలు, ఆలయ ఏఈవో కె. తిరుమలేశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు.

7న సహస్ర తులసిపూజ

కనకమహాలక్ష్మి దేవస్థానంలో ఈ నెల 7న సహస్ర తులసిపూజ నిర్వహించనున్నామని ఆలయ ఈవో కె. శిరీష తెలిపారు. ఈ ప్రత్యేక పూజలో పాల్గొనదలిచే భక్తులు పూజా రుసుం రూ.1500 చెల్లించాలని ఈవో పేర్కొన్నారు.

లలితా పీఠంలో చండీ హోమం



లలితాపీఠంలో చండీ హోమం నిర్వహిస్తున్న వేద పండితులు

సీతంపేట: స్థానిక లలితానగర్‌లోని లలిత పీఠంలో కార్తీక మాసం, బహుళ అష్టమి సందర్భంగా మంగళవారం ఉదయం చండీ హోమం నిర్వహించారు. పండితుల వేద మంత్రోచ్చారణల మధ్య శాస్త్రోక్తంగా హోమం జరిపించారు. గణపతి పూజ, కలశ శుద్ధి, అగ్ని ప్రతిష్టాపన, గోపూజ, పరివార పూజ, సుహాసిని పూజ, దంపత పూజ, చండీ సప్తశతి చివరగా పూర్ణాహుతి నిర్వహించారు. లోకకల్యాణం, విశేష కార్యసిద్ధి కోసం జగన్మాతను ఆరాధించడంలో భాగంగా చండీ హోమం నిర్వహించినట్టు పీఠం మేనేజర్ మన్నవ కృష్ణసేన్ తెలిపారు. సాయంత్రం 1000 గారెలతో కాళీ కాలభైరవ హోమం నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

10న ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల మహాసభ



పోస్టర్ విడుదల చేస్తున్న ఏపీజేఏసీ అమరావతి జిల్లా అధ్యక్షుడు నాగేశ్వరరెడ్డి తదితరులు

మహారాణిపేట : ఈనెల 10న అమరావతిలో ఏపీజేఏసీ అమరావతి అనుబంధ సంఘం ఆధ్వర్యంలో జరగబోయే అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల రాష్ట్ర మహాసభల పోస్టర్‌ను మంగళవారం ఏపీజేఏసీ (అమరావతి) ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు సత్తి నాగేశ్వరరెడ్డి ఆవిష్కరించారు. కలెక్టరేట్ ఆవరణలో ఉన్న రెవెన్యూభవన్ సమావేశ మందిరంలో జరిగిన కార్యక్రమంలో పలువురు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీ అవుట్ సోర్సింగ్ రాష్ట్ర అధ్యక్షుడు సుమన్, జిల్లా ప్రధాన కార్యదర్శి కె.ఎస్. రావు, కోశాధికారి రవిశంకర్, మున్సిపల్ మినిస్టీరియల్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అప్పలరాజు, రవి శ్రీనుబాబు తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ గుర్తు తెలియని వ్యక్తి మృతి



మృతుడు

అక్కిరెడ్డిపాలెం: గుర్తు తెలియని వాహనం ఢీకొట్టడంతో తీవ్ర గాయాలపాలైన ఓ వ్యక్తి కేజీహెచ్‌లో చికిత్స పొందుతూ మరణించారు. గాజువాక పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి.. సోమవారం రాత్రి 11.30 నుంచి 12 గంటల మధ్య సమయంలో గుర్తు తెలియని ఓ వ్యక్తిని శ్రీనగర్ జంక్షన్, 100 ఫీట్ రోడ్డు మధ్యలో గుర్తు తెలియని ఓ వాహనం ఢీ కొట్టి వెళ్లిపోయింది. దీంతో ఆ వ్యక్తి తీవ్ర గాయాలతో రోడ్డు పక్కన పడిపోయారు. సమాచారం అందుకున్న గాజువాక పోలీసులు అతడిని కేజీహెచ్‌కు తరలించగా.. చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందారు. మృతుడి వయసు 45 నుంచి 50 సంవత్సరాలు ఉంటుందని, బ్రౌన్ కలర్ చెక్స్ షర్ట్ ధరించి ఉన్నాడని పోలీసులు తెలియజేశారు. మృతదేహాన్ని కేజీహెచ్ మార్చురీలో ఉంచామన్నారు. వివరాలు తెలిసిన వారు గాజువాక పోలీస్ స్టేషన్‌ను సంప్రదించాలని సూచించారు.

యాచకుడి మృతి



మృతి చెందిన యాచకుడు

బీచ్ రోడ్డు: జీవీఎంసీ 28వ వార్డులో ఓ యాచకుడు మంగళవారం మృతి చెందాడు. రెండు రోజులుగా పడుతున్న వర్షాల కారణంగా తినడానికి ఏమీ దొరకలేదు. ఉండడానికి కూడా సరైన స్థలం లేకపోవడంతో చలికి యాచకుడు మృతి చెందాడు. ఈ విషయం తెలుసుకున్న మూడో పట్టణ పోలీసులు జీవీఎంసీ సిబ్బంది సహకారంతో కేజీహెచ్ మార్చురీకి తరలించారు.

ఈవీఎంలపై అవగాహన శిబిరాలు

ఈఆర్వో లక్ష్మారెడ్డి వెల్లడి



సమావేశంలో మాట్లాడుతున్న లక్ష్మారెడ్డి

గాజువాక : ఎలక్ట్రానిక్ ఓటింగ్ మెషీన్ (ఈవీఎం)లపై ఈ నెల ఏడు నుంచి నియోజకవర్గంలో అవగాహన శిబిరాలను నిర్వహించనున్నట్టు గాజువాక ఓటర్ల నమోదు అధికారి (ఈఆర్వో) డి.లక్ష్మారెడ్డి తెలిపారు. రాజకీయ పార్టీల నాయకులతో జీవీఎంసీ గాజువాక జోనల్ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అన్ని పోలింగ్ కేంద్రాలలోను వచ్చే నెల 20వ తేదీ వరకు అవగాహన కార్యక్రమాలు కొనసాగుతాయని తెలిపారు. ఈ శిబిరాల్లో ఓటర్లు పాల్గొని ఈవీఎంలపై వివరాలను తెలుసుకోవాలని కోరారు. గత నెల 28 నుంచి ఈ నెల 5 వరకు వచ్చిన క్లెయిమ్‌లు, అభ్యంతరాలను పరిశీలిస్తున్నామని తెలిపారు. పదిమంది కంటే ఎక్కువ ఓటర్లు ఉన్న గృహాలు గాజువాకలో ఇంకా 61 ఉన్నాయని, ఆ ఇళ్లల్లో 621 మంది ఓటర్లు ఉన్నారని తెలియజేశారు. వారం రోజుల్లోగా వాటి వెరిఫికేషన్ పూర్తవుతుందని పేర్కొన్నారు. అర్హులందరూ తమ ఓటు హక్కును ఈ నెల తొమ్మిదో తేదీలోగా నమోదు చేసుకోవాలని సూచించారు. సమావేశంలో ఏఈఆర్వోలు పి.సింహాచలం, ప్రసాద్‌బాబు, రమాదేవి, శ్రీలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేటీకరణతో కార్మికులకు అన్యాయం



దీక్షలో పాల్గొన్న పోరాట కమిటీ నాయకులు

కూర్మన్నపాలెం: దేశ ఆర్థికాభివృద్ధికి ప్రభుత్వరంగ సంస్థలే ఆధారమని ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు అన్నారు. అటువంటి సంస్థలను ప్రైవేటీకరణ చేయడం వల్ల దేశ ఆర్థిక వ్యవస్థ పతనమవుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలిలో చేపట్టిన నిరాహార దీక్షలు మంగళవారం నాటికి 1027వ రోజుకు చేరుకున్నాయి. దీక్షలో సంస్థకు చెందిన ఎల్‌ఎంఎంఎం, ఎస్‌బీఎం విభాగాల కార్మికులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పోరాట కమిటీ నాయకులు మాట్లాడుతూ కార్మిక వర్గాన్ని, నిర్వాసితులను, నిరుద్యోగులను నడిరోడ్డుపై పడేసే విధంగా కేంద్ర ప్రభుత్వం కుట్రలు చేస్తోందన్నారు. ఈ కుట్రలను ఉద్యమాల ద్వారా ఎదుర్కొంటామన్నారు. కార్యక్రమంలో పోరాట కమిటీ నాయకులు, ఇతర కార్మికులు పాల్గొన్నారు.

షార్ట్ సర్క్యూట్‌తో చెలరేగిన మంటలు



కాలి బూడిదయిన ఏసీ

గోపాలపట్నం: మర్రిపాలెం వుడాలేఅవుట్‌లో షార్ట్ సర్క్యూట్ వల్ల ఓ ఇంట్లో మంటలు చెలరేగాయి. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాలు.. స్థానిక జ్యోతి ప్లాజాలో మర్రిపాలెం ఉడాలే అవుట్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు మందలపు వాసుదేవరావు నివాసముంటున్నారు. ఇటీవల వాసుదేవరావు దంపతులు ఆస్ట్రేలియాలో ఉన్న కుమార్తె వద్దకు వెళ్లారు. మంగళవారం మధ్యాహ్నం సమయంలో ఇంట్లో నుంచి మంటలు, పొగ రావడంతో అపార్ట్‌మెంట్ వాసులు ఆందోళనకు గురయ్యారు. వెంటనే మర్రిపాలెం ఫైర్ సిబ్బందికి ఫోన్ ద్వారా సమాచారమిచ్చారు. ఘటనా స్థలానికి చేరుకున్న ఫైర్ సిబ్బంది మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. ఇంట్లో ఉన్న గృహోపకరణాలు దగ్ధమయాయి. ఈ అగ్ని ప్రమాదం వల్ల సుమారు రూ.3 లక్షల వరకు ఆస్తినష్టం వాటిల్లినట్టు చెబుతున్నారు. అగ్ని ప్రమాదానికి గల కారణాలను ఫైర్ అధికారులు ఆరా తీస్తున్నారు.